ప్రజాశక్తి
శనివారం 23 సెప్టెంబర్ 2023

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అర్జీలపై నిర్లక్ష్యం చేయొద్దు

పరిష్కారించాల్సిన బాధ్యత అధికారులదే - కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే అని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. కొత్తచెరువు డీఆర్డీఏ వెలుగు భవనంలో జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ పి.కొండయ్య పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, డీఆర్డీఏ పీడీ నరసయ్యతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలను సంబంధిత శాఖ అధికారులు పరిశీలించాలన్నారు. అర్జీ ఏదశలోనూ పరిష్కారానికి నోచుకోని పక్షంలో ఆ విషయాన్ని అర్జీదారునికి తెలపాలని సూచించారు. అర్జీల పరిష్కార ప్రక్రియలో ఆయా శాఖల అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. మండల స్థాయి అధికారులు అర్జీలను పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో నియోజకవర్గస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించామని, ప్రస్తుతం మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు అందరూ బాధ్యతగా వ్యవహరించి స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బారాన్ సాహెబ్, తహశీల్దార్ రామాంజనేయ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పి. అరుణ్ బాబు సూచించారు. కొత్తచెరువు టిటిడి కళ్యాణమండపం సమీపంలోని ఏరియా పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న వివిధ సేవలు గురించి కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు, వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ స్టాక్, కేసుల నమోదు రిజిస్టర్, ల్యాబ్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు లాభదాయకమైన పశు పోషణ పద్ధతులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రకతి వైపరీత్యాల సమయంలో పశువుల మరణ శాతాన్ని తగ్గిస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య అధికారి డా॥ఎన్.శుభదాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డా॥మల్లేష్ గౌడ్, డా॥కష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యకు భారీ వ్యయమే..!

◆ రూ.50 కోట్ల వరకు ఖర్చు ◆ జిల్లాలో ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భారీ కాయుడు... బొజ్జ గణపయ్యకు జనం భారీగానే ఖర్చు పెట్టారు. జిల్లాలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరిగాయి. సాధారణంగా జిల్లాలో మూడు, ఐదు రోజుల పాటు జరుపుతారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులకే నిమజ్జనాలు పూర్తయ్యే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కదిరి, ఇతర పట్టణాల్లో ఐదు రోజులకు అనుమతులిచ్చారు. ఐదు రోజులు పెట్టినవి శుక్రవారం నాడు నిమజ్జనం జరిగాయి. జిల్లా వ్యాప్తంగా అనుమతి తీసుకున్న వరకు ఐదు వేల వరకు విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కదిరి, హిందూపురం, ధర్మవరం తదితర ప్రాంతాల్లో వందలాది విగ్రహాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కువ శాతం మూడు రోజులకే నిమజ్జనాలు జరిగాయి. కదిరిలో మాత్రం ఐదవ రోజు శుక్రవారం నాడు నిమజ్జనం జరిగింది. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా నిమజ్జనం జరిగింది.

భారీ వ్యయమే..

భారీ కాయుడి గణపయ్యకు జనం పెట్టిన ఖర్చు కూడా అధికంగానే పెట్టారు. జిల్లా వ్యాప్తంగా 3000కు పైగా విగ్రహాలు ఏర్పాటయినట్లు తెలుస్తోంది. ఒక్కో చోట లక్ష నుంచి పది లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. తక్కువ అన్న ఒక్కో విగ్రహం ఏర్పాటు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి సగటున లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు అయ్యింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఈ ఐదు రోజుల విగ్రహాల ఏర్పాటుకు అయిన ఖర్చు సుమారు రూ,50 కోట్లకుపై పైమాటేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కదిరిలో వినాయకుని నిమజ్జనం

విగ్రహాల ఏర్పాటు వెనుక వి'నాయకులు'

వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో పెద్దఎత్తున విగ్రహాల ఏర్పాటు జరిగింది. సందు,సందుల్లోనూ విగ్రహ మంటపాలు వెళిశాయి. ఇంత పెద్ద ఎత్తున జరిగిన ఖర్చు వెనుక నాయకులున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో యువకులను బృందాలుగా ఏర్పాటు చేసి విగ్రహాలు ఏర్పాటు చేసే విధంగా ముందస్తు ప్రణాళిక చేశారు. దీనికి కొంత వరకు ఆర్థికపరమైన తోడ్పాటును అందించారు. దీంతో గడిచిన రెండేళ్ళ కంటే ఎక్కువగానే ఈసారి విగ్రహాల ఏర్పాటు జరిగింది.

డీజేల ముందు హోరెత్తిన యువత

విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రతి విగ్రహం వద్ద డీజేల సౌండ్లు దద్దరిల్లాయి. ఇందులో ప్రధానంగా యువత సందడి అంతఇంతా కాదు. గతానికి భిన్నంగా పెద్దఎత్తున యువతులు కూడా పాల్గొని నృత్యాలు చేయడం గమనార్హం. కదిరిలో సాయంత్రం నుంచి రాత్రి ఒంటి గంట వరకు విగ్రహాల నిమజ్జన యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను సైతం పోలీసులు మళ్లించారు.

'మద్యం' ఓపెన్

వినాయక నిమజ్జనం రోజు ఉదయం నుంచే మద్యం విక్రయాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గతంలోనూ చేసేవారు. కాని ఈసారి విక్రయాలు నిలిపివేయలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు యథావిధిగా మద్యం విక్రయాలు జరిగాయి. వినాయక చవితి వేడుకల్లో పాల్గొనే యువత ఒకవైపు మందు... మరోవైపు డీజేల ముందు చిందులు వేశారు.

అందరి ఆమోదంతోనే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఇన్‌ఛార్జి జెసి కార్తీక్

అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి జెసి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పులు, పేర్ల మార్పుకు అన్ని రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ కోరారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం మండల పరిధిలో 1, పట్టణంలో-13, లేపాక్షి మండలంలో 2, చిలమత్తూరు మండలంలో 2 పోలింగ్ కేంద్రాల మార్పులు చేస్తున్నామన్నారు. హిందూపురం రూరల్ 2, చిలమత్తూరు మండలంలో 14 పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పు చేస్తున్నామని తెలిపారు. దీనిపై రాజకీయ పార్టీల నాయకులతో చర్చించామని, మార్పునకు వారు సమ్మతం తెలిపినట్లు చెప్పారు. త్వరితగతిన ఈ ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సీఏ శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం కేటాయింపునకు వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

బీసీ బాలికల వసతి గృహం కోసం బీసీ కాలనీలో ఖాళీగా ఉన్న ఎస్సీ వసతి గృహాన్ని కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ అరుణ్ బాబుకు శుక్రవారం నాడు వినతిపత్రం అందజేశారు. జగన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు సమస్యను విన్నవించారు. వసతి గహంలో లేబర్ ఆఫీస్ ఒకటి మాత్రమే ఉందని, దానిని మరొక చోటకు మార్చి బీసీ బాలికల వసతి గహానికి ఆ భవనాన్ని కేటాయించాలని కోరారు. ఇందుకు స్పందించి కలెక్టర్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌ను భవనం దగ్గరకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు అధికారి భవనాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను అధికారులతో అడిగిత తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సులోచన, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్ కుమార్, హరి, సిఐటియు నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

నూతన పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని గాంధీ బజారులో ఉన్న సరస్వతి విద్యామందిరం నూతన భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఎంఇఒ శ్రీనివాస్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి పాఠశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎంఇఒను పాఠశాల యాజమాన్యం సత్కరించి, జ్ఞాపికను అందజేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, తనయుడు జయరాజు హనుమంత రెడ్డి పాల్గొన్నారు.



ఎంఇఒను సత్కరిస్తున్న సరస్వతి విద్యామందిరం యాజమాన్యం

ప్రతి అక్షరం - ప్రజా పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

-: విలేకరులు కావలసిన ప్రాంతం:-
-: శ్రీ సత్యసాయి జిల్లా :-

తాడిమర్రి, రామగిరి, నల్లమాడ, అమడగూరు, రొళ్ళ, పెనుకొండ రూరల్, ధర్మవరం రూరల్, హిందూపురం రూరల్

ఇంటర్వ్యూ : తేది 25-09-2023 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099311, 312, 313

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం, అనంతపురం
D.No:42/2, Near Old VRL Godown, Ballari Road,
Ananthapuramu-515001.

విభిన్నప్రతిభావంతులకు అభినందన

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలను శుక్రవారం స్థానిక ఎంజిఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అభినందించారు. పుట్టపర్తిలో గురువారం నాడు జిల్లా స్థాయి విభిన్నప్రతిభావంతుల పోటీల్లో బాలికల విభాగం పరుగుపందెంలో సుహాన మూడవ స్థానం, షాట్‌పుట్ అండ్ రన్నింగ్ రేస్‌లో ఆజామ్ మూడవ స్థానం, పునీత్ కుమార్, సుఫియాన్లు విజేతలుగా నిలిచారు. వీరిని ఎంఇఒ-1 గంగప్ప, ఎంఇఒ-2 ప్రసన్న లక్ష్మీ, కౌన్సిలర్ రమేష్‌ల ఆధ్వర్యంలో సన్మానించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, దుర్గాబాయి దేశముఖ్ పాఠశా ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పొట్టిశ్రీరాములు పాఠశాల హెచ్‌ఎం సూర్యనారాయణ, భవిత పాఠశాల ఇన్‌ఛార్జి లలిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రతి రైతూ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తాళికెర, మోరుబాగల్, గుణేమోరుబాగల్ పంచాయతీ పరిధిల్లో పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోపు రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం అధికారులు రుహీనా, నరసింహమూర్తి, విద్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

హిందూపురం తహశీల్దార్‌గా స్వర్ణలత

ప్రజాశక్తి-హిందూపురం

తహశీల్దార్ స్వర్ణలత

హిందూపురం మండల నూతన తహశీల్దార్‌గా స్వర్ణలత శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పెనుకొండలో విధులు నిర్వహిస్తున్న ఆమెను ఉన్నతాధికారులు హిందూపురానికి మార్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్వర్ణలత ప్రజాశక్తితో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన నూతన తహశీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, విఆర్ఓలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మందకృష్ణను కలిసిన బత్తల

ప్రజాశక్తి-కదిరి అర్బన్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ డిల్లీలోని ఎపి భవన్ వద్ద ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను శుక్రవారం కలిశారు. త్వరలో కదిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని ఆయన్ను ఆహ్వానించారు.



మందకృష్ణతో బత్తల వెంకటరమణ

బంగారుతల్లీ లేవమ్మా..

ఒక్కగానొక్క కూతురు... ఎంతో అల్లారు ముద్దుగా చూసుకున్నారు. తమ సర్వస్వం కూతురే అని భావించారు. వినాయక చవితి ఉత్సవాలు పైగా తమ ముద్దుల కమార్తె పుట్టినరోజు ఒకేసారి రావడంతో ఆ తల్లిదండ్రులు పట్టలేని ఆనందంతో వేడుక జరిపేందుకు సిద్ధం అయ్యారు. ఉదయాన్నే 'పుట్టిన రోజు శుభాకాంక్షలు చిట్టి తల్లి' అని నిద్రలేపారు. కొత్తబట్టలు వేసి మహాలక్ష్మిలా అలంకరించారు. బుడిబుడి అడుగులేస్తూ ఆ చిన్నారి కాలనీలోని వారికి చాక్లెట్లను అందించింది. చిన్నారి మోములో చిరునవ్వును చూసి తల్లిదండ్రులే కాదు.. కాలనీవాసులూ మురిసిపోయారు. అయితే ఈ ఆనందం గంటల వ్యవధిలోనే ఆవిరయ్యింది. పాఠశాలలో స్నేహితులకు చాక్లెట్లు ఇచ్చేందుకు వెళ్లిన చిన్నారికి అదే చివరి రోజు అయ్యింది. తరగతి గదికి ఏర్పాటు చేసిన బండ విరిగి మీద పడడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. చిరునవ్వుతో ఇంటి నుంచి వెళ్లిన కూతురు మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. విగతజీవిగా పడిఉన్న కూతుర్ని చూసిన కన్నపేగు తల్లడిల్లిపోయింది. గుంతకల్లులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

మృతి చెందిన చిన్నారి కీర్తన

- ◆ పాఠశాలలో బండ విరిగిపడి చిన్నారి మృతి
- ◆ పుట్టినరోజే చివరిరోజు..
- ◆ తల్లడిల్లిన కన్నపేగు
- ◆ ప్రయివేటు పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ◆ గుంతకల్లులో పెను విషాద ఘటన

ప్రజాశక్తి గుంతకల్లు

గుంతకల్లు పట్టణం పాతగుంతకల్లుకు చెందిన బోయ రంగయ్య, శిరీషాలు దంపతులు. రంగయ్య ప్రయివేటు ఉద్యోగికాగ, శిరీష వార్డు వాలంటీర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఒక్కగానొక్క కుమార్తె కీర్తన(4) ఉంది. ఈ చిన్నారి పట్టణంలోని శ్రీవిద్య ఇంగ్లీష మీడియం పాఠశాలలో ఎల్‌కెజీ చదువుతోంది. శుక్రవారం చిన్నారి పుట్టిన రోజుకావడంతో తల్లిదండ్రులు కూతురుకు కొత్తబట్టలు వేసి అందంగా ముస్తాబు చేశారు. పుట్టినరోజు నాడు స్నేహితులకు చాక్లెట్లు ఇచ్చేందుకు కూతుర్ని పాఠశాలకు తీసుకెళ్లారు. సాయంత్రం 3గంటల సమయంలో తరగతి గదికి ఏర్పాటు చేసిన బండ విరిగిచిన్నారిపై పడింది. తలపై పడడంతో చిన్నారి ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మరణించింది.

పాఠశాలక వెళ్లకున్నా బతికుండే దానివే...

'చాక్లెట్లు ఇచ్చి వస్తానని పాఠశాలలకు వెళ్లావమ్మా కదమా.. ఇంతలోని ఇంత ఘోరం జరిగిందా.. పాఠశాలకు వెళ్లకున్నా బతికుండేదానివి కదమ్మా.. బంగారు తల్లీ ఒక్కసారి లేవమ్మా'.. అంటూ చిన్నారి కీర్తన తల్లిదండ్రులు గుండెలు అవిసేలా రోదించారు. కుమార్తె మృతి వార్త తెలియగానే తల్లిదండ్రులు హుటాహుటిన పాఠశాల వద్దకెళ్లారు. విఘతజీవిగా పడిఉన్న కుమార్తెను చూసి కన్నీటి పర్యవంతం అయ్యారు. కీర్తనా లేవమ్మా అంటూ వారు రోధించిన తీరు అక్కడున్న వారినందరినీ కంటతడి పెట్టించింది.

గుంతకల్లు మరో విషాదం

నీటి కుంటలో పడి చిన్నారి మృతి

పెళ్లై ఎన్ని సంవత్సరాలు అయినా పిల్లలు లేకపోవడంతో ఆ దంపతులు ఎన్నో పూజలు చేశారు. గుళ్ళు తిరిగారు. ఆరుసార్లు గర్భం దాల్చినా అబార్షన్ కావడంతో సంతానం కోసం అనేక మంది వైద్యులను సంప్రదించారు. ఏళ్ల తరబడి నిరీక్షించిన వారి కలనెరవేరింది. పండంటి కూతురు వారికి జన్మించింది. అయితే ఈ సంతోషం మూడేళ్లకే ఆవిరయ్యింది. ముద్దులొలికే వారి కూతురు నీటికుంటలో పడి మరణించింది. ఈ ఘటనతో ఆ కుటుంబంలో చీకట్లు నిండాయి. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటున్న కూతురు మరణించడంతో ఆ తల్లిదండ్రులు శోకసంద్రంలో నిండిపోయారు.

గుంతకల్లు పట్టణంలోని మస్తాన్‌పేటకు చెందిన పెద్దయ్య, భారతిలు భార్యాభర్తలు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. 15 ఏళ్లు అయినా వీరికి పిల్లలు లేకపోవడంతో చాలా మంది వైద్యులను సంప్రదించారు. మూడేళ్ల క్రితం వీరికి ఆడబిడ్డ జన్మించింది. అశ్విని(3) అని పేరు పెట్టి చిన్నారిని కంటికి రెప్పలా చూసుకున్నారు. తమ సర్వసం కూతురే అంటూ వీరి ఆనందాన్ని ఆచిట్టి తల్లిలో చూసుకునేవారు. ఇలాంటి వీరి జీవితంలో పెను విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారి అశ్విని అనుకోకుండా నీటిసంపులో పడింది. దీనిని ఎవరూ గుర్తించకపోవడంతో చిన్నారి ఊపిరాడక మరణించింది. చిన్నారి కన్పించకపోవడంతో తల్లిదండ్రులు వెతగ్గా సంపులో కన్పించింది. బయటకు తీసి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని ఎత్తుకుని గుండలు అవిసేలా రోధించారు. వారి ఆర్తనాదాలు అక్కడున్న వారిచేత కంటతడి పెట్టించాయి. ఈ ఘటనపై 1వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన చిన్నారి అశ్విని

కుస్తీ క్రీడాకారులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయి అండర్ 11-15 గ్రాప్టింగ్ కుస్తీ క్రీడల్లో పతకాలు సాధించిన హిందూపురం క్రీడాకారులకు మైనార్టీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను సత్కరించారు. హర్యానాలోని రోహతక్‌లో ఈ నెల 8వతేదీ నుంచి11వ తేదీ వరకు జరిగిన పోటీల్లో ఏపీ తరపున జిల్లాకు చెందిన 9 మంది క్రీడాకారులు అండర్ 13, 15 విభాగాల్లో పోటీ పడ్డారని కోచ్ శ్రీరంగరాజుపల్లి రమేష్, చరణ్‌లు తెలిపారు. పోటీల్లో శ్రీచరణ్, యాహియా, ధనుంజయలు వెండి పతకం, సయ్యద్, మిలాన్ కుమార్, ప్రణవ్, చందన కాంస్య పతకాలను సాధించారన్నారు. ఈ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా నుంచి జాతీయ గ్రాప్టింగ్ రెజ్లింగ్ కమిటీ ఛైర్మన్ దినేష్ కపూర్, జనరల్ సెక్రెటరీ బీర్జూశర్మ, ఏపీ ఛైర్మన్ సురేంద్రారెడ్డి చేతుల మీదుగా సత్య సాయి జిల్లా హిందూపురం నివాసి ఉసామాబాన్ గ్రాప్టింగ్ కుస్తీ క్రీడల రెఫరీ పతకం అందుకున్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

జగన్నాటకానికి త్వరలోనే తెర

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

జగన్నాటకానికి త్వరలోనే తెరపడనుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 10వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో శుక్రవారం తెలుగు యువత, బిటిడిపి, టిఎన్ఎస్ఎఫ్ కమిటీలతో పాటు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. బికె మాట్లాడుతూ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు టిడిపి అదరదు, బెదరదన్నారు. సిఎం జగన్ త్వరలోనే మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కురుబ కృష్ణమూర్తి, చిన్న వెంకటరాముడు, రొద్దం నరసింహులు, అశ్వర్థనారాయణ, చిన్నప్పయ్య, హుజూర్, సుబ్బరత్నమ్మ, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, తెలుగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం : పల్లె

పుట్టపర్తి అర్బన్ : స్థానిక టిడిపి కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 10వ రోజుకు చేరుకోగా శుక్రవారం తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, బిటిడిపి, అనుబంధ విభాగాల నాయకులు, మహిళా నాయకురాలు మద్దతు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరై మాట్లాడారు. సిఎం జగన్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, బెస్త చెలపతి, శ్రీరామ్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, ఐటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొమ్మయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, పుట్టపర్తి తెలుగు యువత నాయకులు ఓబుల్ రెడ్డి, నాయకులు గణేష్ చౌదరి, మాల మనోహర్, సుధాకర్, మురళీధర్, కృష్ణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, రామాంజి పాల్గొన్నారు.

అక్రమ కేసులు, అరెస్టులకు భయపడం : గుండుమల

గుడిబండ : వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గుండు మల తిప్పేస్వామి పేర్కొన్నారు. గుడిబండలో శుక్రవారం మాజీ ఎంపిటిసి క్రిష్టప్ప ఇంటి ముందు గుండుమల ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు నిరాహార దీక్ష చేపట్టారు. గుండుమల మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రతిపక్ష నాయకులపై కక్ష కట్టి ఓ సైకోలా ప్రవర్తిస్తూ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి టిడిపి నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులు సృష్టిస్తున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. దీక్షలో మండల కన్వీనర్ మద్దనకుంట ఓప్పు, బూదిపల్లి జయరామప్ప, న్యాయవాది శివకుమార్, యువ నాయకుడు దుర్గేష్, షబ్బీర్, ఎంపిటిసి క్రిష్టప్ప, మండల ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, బూత్ కన్వీనర్లు లక్ష్మీనరసప్ప, భీమరాజు, జనార్దన్, రాజన్న, పురుషోత్తం, శ్రీరామప్ప, నజీర్, భోజరాజు, రాజు, లక్ష్మీనారాయణప్ప, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు

హిందూపురం : రాజకీయ కక్షతోనే సిఎం జగన్ చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించారని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. టిడిపి దళిత విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా వెళ్లి పెనుకొండ రోడ్డులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ సిఐడిని అడ్డు పెట్టుకొని వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు. హిందూపురం పారిశ్రామికవాడలో గార్మెంట్స్ మహిళలతో కలిసి సాయంత్రం రోడ్డుపై నిరసన తెలిపారు. మహిళలతో కలిసి నాయకులు ప్లకార్డులు చూపిస్తూ చంద్రబాబుకు అండగా ఉందాం రాష్ట్రాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, డిఇ రమేష్ కుమార్, అనిల్ కుమార్, కొల్లకుంట అంజనప్ప, రామాంజనమ్మ, బేవనహళ్లి ఆనంద్, అమర్నాథ్, విజయలక్ష్మి,

పుట్టపర్తిలో దీక్షలో పాల్గొన్న పల్లె, తెలుగు యువత నాయకులు

వెంకటలక్ష్మి, సర్పంచులు చిక్కిరప్ప, మంజునాథ్, రూరల్ మండల నాయకులు ఆదినారాయణ, సంతేబిదనూరు శ్రీరాములు, ఆంజనేయులు, అంజి, మాంగేష్, సతీష్, శివశంకర్, ఇందాద్, దేశాయ్ మురళి, అభి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వాల్మీకి సంఘం నాయకులు స్థానిక దుర్గమ్మ ఆలయం నుంచి ర్యాలీగా శిబిరం వద్దకు చేరుకుని దీక్షలో పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేష్ చేపట్టిన యాత్రలకు లభిస్తున్న ప్రజాదరణ చేసి ఓర్వలేక సిఎం జగన్ ఏ తప్పు చేయని చంద్రబాబును అరెస్టు చేయించారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఓటు ద్వారా గుణపాఠం చెబుతారన్నారు.

ముదిగుబ్బలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన మాజీ ఎమ్మెల్యే సూరి అభిమానులు

చంద్రబాబుకు మద్దతుగా పోస్టుకార్డు ఉద్యమం

ముదిగుబ్బ : చంద్రబాబుకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు లక్ష పోస్టుకార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ముదిగుబ్బలో 6వేల కార్డులు పంపిణీ చేసి ప్రతి ఒక్కరూ ఒకటి గవర్నర్‌కి, ఒకటి చంద్రబాబు ఉన్న జైలుకు పోస్టల్ ద్వారా పంపాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్‌నాథ్‌రెడ్డి, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, జయకృష్ణ, బాలభాస్కర్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ దీక్షలో మాట్లాడుతున్న బికె పార్థసారథి,

గుడిబండలో శిబిరంలో ప్రసంగిస్తున్న గుండుమల,

పురంలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

'చలో విజయవాడ' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మను ధర్మ సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 29వ తేదీ విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కెవిపిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రశాంతి గ్రామ్ సిపిఎం కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా మహాధర్నా చేపడుతున్నామన్నారు. అంటరాని తనం నిర్మూలన, 41 సిఆర్‌టిసి జస్టిస్ పున్నయ్య సిఫార్సుల అమలు, డప్పు కళాకారులు, చర్మకారులకు రూ. 5వేల పెన్షన్, కాటి కాపరులకు నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ నిధుల విడుదల, నిరుపేద కుటుంబాలకు 3 ఎకరాల భూమి పంపిణీ, తదితర డిమాండ్లపై ప్రభుత్వాలను నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఇంతియాజ్, జిల్లా ఆఫీస్ సెక్రటరీ సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

పెనుకొండ : పట్టణంలోని సిపిఎం కొట్టాల వద్ద కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'చలో విజయవాడ' పోస్టర్లను విడుదల చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ దేశంలో మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి అధికార పార్టీలు పూనుకున్నాయని, కావున భారత రాజ్యాంగం అమలు కోసం ప్రతి దళితుడు, పేదవాడు మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల కార్యదర్శి తిప్పన్న, వెంకట రాముడు, మైలారప్ప, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల తహశీల్దార్‌గా హసీనా సుల్తానా బాధ్యతల స్వీకరణ

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల తహశీల్దార్‌గా హసీనా సుల్తానా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ బదిలీపై హిందూపురం తహశీల్దార్‌గా వెళ్లారు.

నూతన తహశీల్దార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

ఎస్పీని కలిసిన నూతన ఆర్ఐ

పుట్టపర్తి రూరల్ : అనంతపురం నగరంలోని ఎఆర్ హెడ్ క్వార్టర్ విభాగంలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రెడ్డి ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొంది సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించి న అనంతరం ఆయన ఎస్పీ మాధవ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఆర్ఐ శ్రీశైలంరెడ్డి కడపకు బదిలీ అయ్యారు.

నేడు జాబ్‌మేళా

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం(నేడు) బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ 'ఆల్సెక్ టెక్నాలజీస్' వారు ప్రాంగణ నియమకాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి, ఎఒ కేశవయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, విద్యార్హత నకలు కాపీలతో పాటు ఆధార్, ఫొటో తీసుకొని రావాలని వారు తెలిపారు.

25న కలెక్టరేట్ ముట్టడి

పుట్టపర్తి అర్బన్ : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ మాధవరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 28 ఏళ్లుగా శాంతియుతంగా పోరా టాలు చేస్తున్నా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో బిల్లును ప్రతిపాదించాలని, అలాగే ఎపి అసెంబ్లీలో సైతం బిల్లు పెట్టి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి జిల్లాలోని మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అక్కులప్ప, గంగాద్రి, నాగన్న, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్‌వాడీల సమస్యలపై ఈ నెల 25వ తేదీ విజయవాడలో చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయం లో శుక్రవారం నరసింహప్ప, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, తెలంగాణలో కంటే అదనంగా వేతనాలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తదితర

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు, అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యలపై మహాధర్నా చేపడుతున్నామన్నారు. అందులో హిందూపురం ప్రాజెక్టులో పని చేస్తున్న వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అందరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో శైలజ, విజయమ్మ, నాగమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి కొండ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన క్వారీ టిప్పర్ల రాకపోకల వల్ల పంట పొలాలు, గ్రామంలోని రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామస్తులు టిప్పర్లు క్వారీ వైపు వెళ్లకుండా అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌కెసి కంకర ఫ్యాక్టరీ యాజమాన్యం ఇష్టారాజ్యాంగా వ్యవహరించడం వల్ల పంట పొలాలు నష్టపోవడమే కాకుండా కంకర తోలే టిప్పర్లు మితిమీరిన లోడు వేసి రోడ్లపై రవాణా చేయడం వల్ల తారు రోడ్లు ప్రస్తుతం మట్టిరోడ్డులా మారాయన్నారు. అతివేగంగా వెళ్తున్న టిప్పర్ల వల్ల విపరీతమైన దుమ్ము, ధూళి వెలువడడంతో స్థానికులు, రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యా

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి తక్షణమో క్వారీ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అల్లం రమేష్, శ్రీనివాసులు, రంగనాథం, ఆంజనేయులు, వెంకటరమణ, ఎ.శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిపిహెచ్ఎన్ఒ వీరమ్మ తనిఖీ చేశారు. ఇంటింటి సర్వేపై వివరాలు తెలుసుకుని వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి రోగాల బారిన పడకుండా ఉండాలని, పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, ఎంఎల్‌హెచ్‌పి రాధ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, ఆశా కార్యకర్తలు పద్మావతి, వాణిబాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రస్తాలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

నంబులపూలకుంట మిట్ట కింద ఉన్న ప్రభుత్వ రస్తాలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారుల సమక్షంలో జెసిబి సాయంతో తొలగించారు. తహశీల్దార్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పరిసర ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఆక్రమించినా, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా, దొంగ పట్టాలు సృష్టించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఎంపిపి రాము. సర్పంచ్ ఆంజనేయమ్మ, ఎంపిడిఒ ఆదినారాయణ, డిప్యూటీ తహశీల్దార్ రవినాయక్, మండల సర్వేయర్ అశోక్, గ్రామ సర్వేయర్ ఉపేంద్ర, మండల ఎఇ రెడ్డి వరప్రసాద్, ఇంజిరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీ రమేష్, విఆర్ఒ, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఒపిఎస్ సాధనకై చేపట్టిన నిరసనలో భాగంగా శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రెక్కమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఆమోద యోగ్యం కానీ జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమన్నారు. కార్యక్రమంలో హారుణ్, ఆనంద్‌రెడ్డి, సుచరిత, ఫిరోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జిలతో నిరసన

గాండ్లపెంట : రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఒపిఎస్ సాధనకై చేపట్టిన నిరసనలో భాగంగా మధ్యాహ్న భోజనం విరామ సమయంలో మండల పరిధిలోని కటారుపల్లి జడ్పి హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.తాహీర్‌వలి, ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం జగన్ జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు సుదర్శన్, నరసింహులు, విజయ్, సీతయ్య, నరేంద్ర, పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ తీసుకొచ్చిన జిపిఎస్‌ను వెంటనే ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సానే రవీంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు జిపిఎస్‌కు వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఉన్న గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సానే రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఒపిఎస్ తప్ప ప్రత్యామ్నాయ విధానాలను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్

ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వెంటనే విడుదల చేసి ప్రమోషన్స్, బదిలీలు చేపట్టాలని, విద్యార్థుల సంఖ్య ప్రకారం పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

'జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు'

ముదిగుబ్బ : ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్ ఇప్పుడు సిపిఎస్ కంటే ఘోరమైన జిపిఎస్‌ను తీసుకు రావడం బాధాకరమన్నారు. ఒపిఎస్ సాధనలో భాగంగా ఈ నెల 25వ తేదీ వరకూ నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫక్రుద్దీన్, రఫీ, గౌడ్, శ్రీనివాసులు, కుమార్, కుళ్లాయప్ప, అనుపమ, వాణి, శ్రీలక్ష్మి, నాగరాజు, సత్యనారాయణ, గంగరాజు, షబ్బీ ర్, గోపాల్, ప్రసాద్, బాబా, రంగనాథ్ పాల్గొన్నారు.

గోరంట్ల : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తహశీల్దార్ అశోక్‌కి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒపిఎస్‌ను అమలు చేయకుండా జిపిఎస్‌ను తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని, దీనిని అంగీకరించమన్నారు. ఒపిఎస్‌ను అమలుచేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలం లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూపురం : జిపిఎస్, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని ఎంటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంతో పాటు రూరల్ మండలం వ్యాప్తంగా మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సిద్దగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం జగన్ సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్‌ను ఏక పక్షంగా ఉద్యోగులపై రుద్దడం అప్రజాస్వామిక చర్య అన్నారు. కార్యక్రమంలో ఎంటిఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, పెన్నోబులం, హిందూపురం అధ్యక్షులు జనార్దన్, శంకర్, నాయకులు బాలకృష్ణ, సురేంద్ర, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూపురంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గంగమ్మ ఒడికి గణనాథుడు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఐదు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడు శుక్రవారం గంగ ఒడికి చేరాడు. పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర కోలాహలంగా సాగింది. పట్టణంలో దాదాపు 103 విగ్రహాలను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఖాద్రి నృసింహుని ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి తొలుత అర్చకులు పూజలు చేసి అనంతరం ఊరేగింపుగా కదిరి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకోగా మాజీ ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ పార్థసారథి ప్రత్యేక పూజలు చేసి భక్తుల వినాయకుని నామస్మరణ మధ్య రథాన్ని ముందుకు లాగి నిమజ్జనం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై ఇందిరాగాంధీ, అంబేద్కర్, వేమారెడ్డి సర్కిళ్లు, టవర్ క్లాక్, కోనేరు మీదుగా బైపాస్ రోడ్డులోని రామనాయునికుంట వరకు సాగింది. శోభాయాత్రలో పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కందికుంట సింహ కోట వినాయకుని రథం ట్రాక్టర్ నడిపి యువకులను ఉత్సాహపరిచారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి శోభాయాత్రను పరవేక్షించారు. డిఎస్‌పి శ్రీలత ఆధ్వర్యంలో ముగ్గురు డిఎస్పీలు, 10 మంది సిఐలు, 400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కదిరి గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కదిరి అర్బన్ : పట్టణంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన 60 అడుగుల గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఊరేగింపులో సైతం వినూత్నంగా ముందు బసవన్నలు, వాహనంలో వినాయకుని విగ్రహాన్ని కొలువుదీర్చి శోభాయాత్ర నిర్వహించడం పట్టణవాసులను ఆకట్టుకుంది.

మడకశిర : మండల పరిధిలోని జమ్మనపల్లిలో శుక్రవారం నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యువకులు భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించి సమీపంలోని నీటి కుంటలో నిమజ్జనం చేశారు.

బుక్కపట్నం : ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జన కార్యక్రమానికి తరలివెళ్లాయి. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

కదిరి గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న కందికుంట

అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

హిందూపురం : పట్టణంలో కొలువైన గణపతుల విగ్రహాల వద్ద శుక్రవారం వైసిపి ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్ షాజియా, నాయకులు చల్లాపల్లి బాబురెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, మార్కెట్ చాంద్, బాలాజీ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పురంలో వినాయకునికి పూజలు చేస్తున్న దీపిక, నాయకులు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర : మడకశిర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీ పడ్డ అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ నాగమల్లేశ్వరి తెలిపారు. పట్టణంలోని మడకశిర-8లో కార్యకర్త పోస్టు (ఒసి), సహాయకుల పోస్టులు మడకశిర-4 (బిసి-ఎ), మడకశిర-9 (ఎస్‌సి), ఈచలెడ్డి బిసి-బి, కొలిమిపాల్యం ఒసి, గోవిందాపురం ఒసి, దాసలయ్యపాలెం ఎస్‌సి, డిఎన్ పాలెం ఒసి, అగళి మండలంలోని దాస్య గౌడన్నహళ్లి ఒసి, నరసాంభూతి ఒసి, రొళ్ల మండలంలోని అగ్రహారం ఒసిలకు కేటాయించారు.

సిడిపిఒ నాగమల్లేశ్వరి

మసీదు నిర్మాణానికి విరాళం

తనకల్లు : మండల పరిధిలోని దుగినేపల్లి గ్రామంలో మసీదు నిర్మాణం, అభివృద్ధికి శుక్రవారం కొర్తికోట సీనియర్ టిడిపి నాయకులు, మాజీ సర్పంచి ఎస్‌కె మస్తాన్ వలి రూ. లక్ష విరాళాన్ని మత పెద్దలకు అందజేశారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

అమరాపురం : మండల పరిధిలోని శంకర గ్రామానికి చెందిన గొర్రెలకాపరి రంగనాథ్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి భార్య లతమ్మకు శుక్రవారం ఎంపిపి ఈరన్న సమక్షంలో వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేశారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వితంతు పింఛన్ మంజూరయ్యేలా చూస్తామని, అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి నాయకులు జి.నాగరాజు, నరసింహమూర్తి, వాలంటీర్ అనిత పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

గాండ్లపెంట : గాండ్లపెంట సమీపంలో ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారున. తలుపుల మండల పరిధిలోని చంద్రనాయక్ తండాకు చెందిన బాబ్జినాయక్ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి కదిరికి వెళ్తుండగా కదిరి నుంచి ఎన్‌పి కుంటకు బైక్‌పై వెళ్తున్న విజయ్ ఎదురెదురుగా ఢీకొన్నారు. స్థానికులు వారిని 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-మడకశిర

పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎఒ రాజ్య లక్ష్మి సూచించారు. రొళ్ల మండలం రత్నగిరి గ్రామం రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే యాజమాన్య పద్ధతులను వివరించారు. రత్నగిరి, దొడ్డేరి ఆర్‌బికెల్లో ఖరీఫ్ పంట నమోదుని పరిశీలించారు. ఈ నెల 30వ తేదీ లోపు పంట నమోదు ప్రక్రియ, రైతు ఈకెవైసి, పంట వేసిన ప్రతి

రత్నగిరిలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దశ్యం

రైతువి తెలియజేయాలని ఆర్‌బికె సిబ్బందికి తెలిపారు. పంట నమోదు పారదర్శకంగా చేయాలని ఆదేశించారున. ఆమె వెంట రత్నగిరి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్యజ్యోతి, దొడ్డేరి ఆర్‌బికె సిబ్బంది, విఆర్ఎలు, రైతులు ఉన్నారు.

వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉబ్బర ప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ప్రసాద్‌రెడ్డి కదిరి పట్టణం కోర్టులో సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూనే వైసిపి పురోభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం పట్ల, ఎన్నికకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి, తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలిమి జిలాన్, సేవాదళ్ జోనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి(డికె బాబు), కౌన్సిలర్లు సైదాపురం మురళి, ఉట్టి ఓంప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు నాగబయారెడ్డి, పాలపాటిదిన్నె ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.భాస్కర్‌రెడ్డి, తలుపుల మండల కన్వీనర్ ఫయాజ్, న్యాయవాదులు రామ్మోహన్ రెడ్డి, శివప్రసాద్, మహ్మదుల్లా, తదితరులు ప్రసాద్‌రెడ్డికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలో సచివాలయ భవనాలు, వెల్ నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ వై.నాగేశ్వర్‌రెడ్డి గుత్తేదారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఇఒఆర్‌డి అశోక్ కుమార్‌రెడ్డి, పిఆర్ అసిస్టెంట్ ఇఇ శశికుమార్‌తో కలిసి నిర్మాణ దశ, పూర్తి కావస్తున్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. మండల పరిధిలోని బత్తలపల్లి, వెంకటగారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను సందర్శించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పెడపల్లి-1, 2 సచివాలయాలను సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష, సంక్షేమ పథకాల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్ అధికారుల తో కలిసి జగనన్న లేఔట్‌ను సందర్శించారు. వెంకటగారిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్ఎం, వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాల వితరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి

పుట్టపర్తికి చెందిన ఉపాధ్యాయులు షబ్బీర్ కుమార్తె మెహతాజ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలకు ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. ప్రశాంతి నిలయం పోస్టాఫీసులో పోస్టుమేన్‌గా పనిచేస్తున్న అల్లబకాష్ వాటిని పాఠశాలకు అందజేయగా ఉపాధ్యాయ బృందం అల్లబకాష్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ సభ్యులు శామీర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నా మని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధిక, బాబు, శంకర్‌నాయక్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.